ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

వార్త న్యూస్ యాప్
డౌన్లోడ్ చేసుకోండి
DOWNLOAD
: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-09-2025,శనివారం

## ఒడిశాలో రూ. 60,000 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించిన మోదీ



.గ్రీన్ టెలికాం టవర్ కాంప్లెక్స్ ఆరంభం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

.టెలికమ్యూనికేషన్ రంగంలో దాదాపు రూ.37,000 కోట్ల వ్యయంతో 97,500 పైగా 4జి మొబైల్ టవర్లు ఏర్పాటు చేశారు.

.సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులుగా అప్‌గ్రేడ్ చేయడానికి శంకుస్థాపన చేశారు.

**ఒడిశా,సెప్టెంబర్27:** ఒడిశాకు ప్రధాని మోదీ భారీ కానుక-గ్రీన్ టెలికాం టవర్ కాంప్లెక్స్ ఆరంభం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం (సెప్టెంబర్ 27) ఒడిశాలోని ఝార్సుగూడ జిల్లాలో రూ.60,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ కూడా హాజరయ్యారు. టెలికమ్యూనికేషన్, రైల్వేలు,ఆరోగ్య సంరక్షణ,ఉన్నత విద్య,నైపుణ్యాభివృద్ధి,గ్రామీణ గృహనిర్మాణం వంటి విభాగాల్లో పలు కీలక ప్రాజెక్టులు ప్రారంభం అయ్యాయి.టెలికమ్యూనికేషన్ రంగంలో దాదాపు రూ.37,000 కోట్ల వ్యయంతో 97,500 పైగా 4జి మొబైల్ టవర్లు ఏర్పాటు చేశారు.వీటిలో ఏర్పాటు చేసిన 92,600 టవర్లు,అలాగే డిజిటల్ ఇండియా ఫండ్ కింద నిర్మించిన 18,900 టవర్లు ఉన్నాయి.ఈ టవర్లు సుమారు 26,700 గ్రామాలను కలుపుతూ,రెండు మిలియన్లకు పైగా కొత్త వినియోగదారులకు సౌరశక్తి ఆధారిత సేవలను అందిస్తాయి.దీని వల్ల ఈ కాంప్లెక్స్ దేశంలోనే అతిపెద్ద గ్రీన్ టెలికాం టవర్ హబ్‌గా నిలుస్తుంది.మృత భారత్ అదే విధంగా,మోదీ పలు రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి, మరికొన్నింటిని జాతికి అంకితం చేశారు.సంబల్పూర్‌సరళ రైలుఫ్లైఓవర్,కోరాపుట్‌బైగూడ లైన్ డబ్లింగ్,మనబార్‌కోరాపుట్‌గోర్పూర్ >>2



## హైదరాబాద్ కమిషనర్‌గా సజ్జనార్

**హైదరాబాద్,సెప్టెంబర్27:**తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున బదిలీలు చేపట్టింది.శాంతి భద్రతల నిర్వహణ, పాలనలో వేగం పెంచడం,విభాగాల మధ్య సమన్వయం బలోపేతం చేయడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ఆరుగురు ఐఏఎస్ అధికారులు,23 మంది ఐపీఎస్ అధికారుల బదిలీకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని ముఖ్యంగా ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు అధికారిక ప్రకటన రూపంలో వెల్లడించారు.ఆర్టీసీ ఎండీగా సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న వీసీ సజ్జనార్ బదిలీ అయ్యారు.ఆయన స్థానంలో ఎండీగా మరో ఐపీఎస్ అధికారి నాగిరెడ్డి నియమితులయ్యారు.ఇక సజ్జనార్ నాలుగేళ్ల తర్వాత యూనిఫాం వేసుకోనున్నారు. తాజాగా బదిలీల్లో భాగంగా ఆయన్ను రేవంత్ సర్కార్ హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా కీలక పోస్టులోకి పంపింది.ప్రస్తుతం హైదరాబాద్ సీపీగా ఉన్న సీవీ ఆనంద్‌ను హోంశాఖ కార్యదర్శిగా నియమించారు. రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగానికి చీఫ్‌గా విజయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించనున్నారు.పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా స్టీఫెన్ రవీంద్ర, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా శిఖా గోయల్‌కు బాధ్యతలు అప్పగించారు.గ్రేహౌండ్స్ ఏడీజీగా >>2



## నవరాత్రి ఆరవ రోజు బంగారం, వెండి తాజా రేట్లు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్27:** నవరాత్రి ఆరవ రోజు బంగారం ధర పెరిగింది (శనివారం 27 సెప్టెంబర్ 2025) భారతదేశంలో నవరాత్రి ఆరవ రోజు (27 సెప్టెంబర్ 2025) బంగారం ధరలు పెరిగాయి. నిన్నటి శుక్రవారం కంటే రూ.500పెరిగి బంగారం రేటు పెరిగింది.ఢిల్లీ, లక్నో,జైపూర్,నోయిడా,గాజియాబాద్ వంటి ఉత్తర భారత నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్‌బంగారం ధరసుమారు రూ.1,10,000 వద్ద ట్రేడవుతోంది.వెండి ధర కిలోకు రూ.1,43,100గా ఉంది.బంగారం ధరల పెరుగుదల వెనుక కారణాలు:బంగారం ధరల పెరుగుదల వెనుక ప్రధానంగా అంతర్జాతీయ కారణాలే ఉన్నాయి.ప్రపంచ ఆర్థిక పరిస్థితి, అమెరికన్‌డాలర్‌లో ఊచకోతలు,పెట్టుబడిదారుల భద్రత కోసం బంగారాన్ని ఎంచుకోవడం వంటివి ధరలను ప్రభావితం చేశాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, వెండి ధరలు మరికొంత పెరగవచ్చు, కానీ బంగారం ధరల్లో కొంత హెచ్చుతగ్గులు కనిపించే అవకాశం ఉంది.నగరాల వారీగా బంగారం ధరలు (27 సెప్టెంబర్ 2025)హైదరాబాద్ 24 క్యారెట్: రూ.1,05,310 / 10 గ్రాములు 22 క్యారెట్: రూ.1,14,940/ 10 గ్రాములు.

## ఎలుగుబంటి దాడిలో దంపతులుమృతి

**సిర్పూర్(టి),సెప్టెంబర్27:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సిర్పూర్ (టి) మండలంలోని పెద్ద బండ ఫారెస్ట్ బీట్ భీమన్నదేవర సమీపంలో అచెల్లిగ్రామానికి చెందినపశువుల కాపలదారులు శేఖర్,సుశీల మృతదేహాలు గురువారం రాత్రి లభ్యంకావడం కలకలం రేపింది.కాగజ్నగర్ డిఎస్పి,అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగా ఎలుగుబంటి దాడిలో మృతిచెంది నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.మృతులకుముగ్గురు కూతుర్లు ఒక కుమారుడు ఉన్నారు.విషయం తెలుసుకున్న ఉమ్మడి అదిలాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విట్టల్ సిర్పూర్ సామాజిక ఆసుపత్రికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.మృతికిగల కారణాలు అడిగి తెలు సుకున్న ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అందే సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని బాధిత కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.అటవీ శాఖ అధికారుల సమగ్ర నివేదిక అందిన తర్వాత తగుచర్యలు తీసుకుంటామని ఆయనతెలిపారు. ప్రభుత్వం తరపున ఇందిరమ్మఇల్లు, కుటుంబం లో ఒకరికి కాంట్రాక్ట్ బేసిక్ ఉద్యోగం >>2

## రేపు ఎన్నికల షెడ్యూల్ విడుదల?



**హైదరాబాద్,సెప్టెంబర్26:**తెలంగాణలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన జీవోను ప్రభుత్వం విడుదల చేసిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎన్నికల షెడ్యూల్‌పై ఉత్కంఠ నెలకొంది. ఈ జీవో విడుదలతో పంచాయతీ రాజ్ వ్యవస్థలో బీసీ వర్గాల ప్రాతినిధ్యం మరింత పెరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.రిజర్వేషన్‌లను స్పష్టంగా పేర్కొన్న జీవో అమల్లోకి వచ్చిన తరువాత ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమమవుతుందని అధికారులు సూచిస్తున్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక ఎన్నికల నిర్వహణపై పథకరూపం సిద్ధం చేస్తోంది.ఈసీ-సీఎస్,డీజీపీ సమీక్షా సమావేశం స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివరాలు,సిబ్బంది అవసరాలు, భద్రతా ఏర్పాట్లపై స్పష్టత కోసం ఎన్నికల సంఘం ఇవాళ సీఎస్,డీజీపీతో సమావేశం నిర్వహించింది.ఈ సమావేశంలో ఆయా స్థానాల సంఖ్య,ఓటర్ల జాబితా,భద్రతా బలగాల వినియోగం,ఎన్నికల వ్యయాలపై చర్చ జరిగింది.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ల భద్రత, సజావుగా పోలింగ్ జరగడం,సిబ్బంది లభ్యత వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ సమీక్ష తర్వాత రేపే షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందని అధికార వర్గాలు సంకేతాలుఇస్తున్నాయి.ఎంపీటీసీ,జడ్పీటీసీ-తర్వాత సర్పంచ్ ఎన్నికలు అధికార వర్గాల సమాచారం ప్రకారం ముందుగా మండల పరిషత్(ఎంపీటీసీ),జిల్లాపరిషత్ (జడ్పీటీసీ) ఎన్నికలు నిర్వహించి,ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలను చేపట్టే అవకాశం ఉంది.ఈ విధంగా దశలవారీగా ఎన్నికలు నిర్వహించడం ద్వారా రిజర్వేషన్ అమలు,సిబ్బంది సమన్వయం, భద్రతాచర్యలు మరింతసమర్థవంతంగా చేయవచ్చని భావిస్తున్నారు. ఎన్నికల సంఘంనిర్ణయంతో రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని గ్రామీణ ప్రజలకు ప్రాతినిధ్యం కల్పించేదిశగా కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది.ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఈ ఎన్నికలు మరింత మైలురాయిగా నిలుస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## మొదటి ప్రమాద హెచ్చరిక జారీ, అధికార యంత్రాంగం అప్రమత్తం

**భద్రాచలం,సెప్టెంబర్27:**భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టంవేగంగా పెరిగింది.శుక్రవారం ఉదయం ఆరు గంటలకు 34.8 అడుగుల వద్ద గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతూ శనివారం ఉదయం 6 గంటలకు చేరుకుంది.ఉదయం 8 గంటలకు 41.6 అడుగులు,9 గంటలకు 42 అడుగులు,10 గంటలకు 42.30 అడుగులు,11 గంటలకు 42.5 అడుగులు,12 గంటలకు 43 అడుగులకు చేరుకోగా భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు.అదేవిధంగా మధ్యాహ్నం 1 గంటకు 43.27అడుగులు,2గంటలకు 43.50అడుగులు మూడు గంటలకు 43.90 దుగులు,నాలుగు గంటలకు44.20అడుగులు ఐదు గంటలకు 44.50 అడుగులు,6గంటలకు 44.70అడుగులుఎనిమిది గంటలకు45.10 అడుగులుఎత్తులో10,18,806 క్యూసెక్కుల వరదనీరు దిగువప్రాంతానికిపయనం అవుతుంది.కాగా నేడు ఉదయం 47 అడుగుల



చేరువలో గోదావరి ప్రవాహం ఉండనుందనిసంబంధిత అధికారులు అంచనాకు వస్తున్నారు.ఆ తర్వాత మరో రెండు అడుగులు తగ్గి మరల అదే స్థాయికి పెరగనుందని తెలుపుతున్నారు. ఈ వారం రోజులు కూడా గోదావరి ఇదే స్థాయిలో ప్రవహించనుందని వెల్లడిస్తున్నారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయగానే అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గోదావరి నది పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న >>2

## ఎంబీజీఎస్ నుంచి బస్సుల రాకపోకలు బంద్..కారణం ఏంటంటే?



**హైదరాబాద్,సెప్టెంబర్27:**హైదరాబాద్ నగరంలో ఇటీవల కురుస్తున్న భారీవర్షాల కారణంగా మూసీ నది ఉగ్రరూపం దాల్చింది.సాధారణ ప్రవాహానికి మించి,మూసీనది ఉప్పొంగి ప్రవహించడం ప్రారంభించింది.ముఖ్యంగా మూసీ పరివాహక ప్రాంతాలు అయిన పురానాపూల్, జియాగూడ్, చాదర్‌ఘాట్ వద్ద వరద ఉధృతి గణనీయంగా పెరిగింది.ఈ పరిస్థితులు వలన ఎంబీజీఎస్ ప్రాంగణంలో వరద నీరు చేరడంతో నగరంలోని ప్రజలు,ప్రయాణికులు పెద్ద ఇబ్బందులకు గురయ్యారు.తాజాగా మూసీనది ఉప్పొంగిననేపథ్యం దృష్ట్యా, టీజీఎస్ఆర్టీసీ అధికారులు ఎంబీజీఎస్ బస్ స్టేషన్ నుంచి అన్ని బస్సుల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు.అయితే,నగర ప్రయాణికుల ఆందోళన తగ్గించడానికి,ఈబస్సుల గమ్యస్థానాలను మార్గాలను మార్చి వేరే ప్రాంతాల నుంచి నిర్వహించటం ప్రారంభించారు. ఆదిలాబాద్,కరీంనగర్,మెదక్,నిజామాబాద్ వైపునకు వెళ్లే బస్సులుఇప్పుడు జేబీఎస్ నుండి ప్రయాణం చేస్తున్నారు.వరంగల్,హన్మకొండ వైపునకు వెళ్లే సర్వీసులు ఉప్పల్‌క్రాస్ రోడ్స్ ద్వారా వెళ్తున్నాయి. సూర్యాపేట,నల్గొండ,విజయవాడకు వెళ్ళే బస్సులు ఎల్బీనగర్ ప్రాంతం నుంచి నిర్వహిస్తున్నారు. అలాగే,మహబూబ్‌నగర్,కర్నూల్,బెంగళూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్ళే సర్వీసులు ఆరాంఘర్ చౌరస్తా నుంచి ప్రయాణిస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి తిప్పుతున్నామని >>2

## రహదారుల నాణ్యతలో రాజీ లేదు: 17 కోట్లతో పలు రోడ్లకు శంకుస్థాపన



**గరిడేపల్లి (నల్గొండ),సెప్టెంబర్27:**నియోజకవర్గంలో రహదారుల నిర్మాణంలో రాజీపడే ప్రసక్తేలేదని,అన్ని మండల కేంద్రాలు,గ్రామాల్లో కొత్త రహదారులను నిర్మిస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.గరిడేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు రూ.17 కోట్లతో నిర్మిస్తున్న రహదారుల పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు.గత కొన్ని సంవత్సరాలుగా నియోజకవర్గంలోని రోడ్లు నిరక్ష్యంకారణంగా పూర్తిగా దెబ్బతిన్నాయని,వాటి స్థానంలోకొత్త రహదారులు నిర్మించేందుకు గరిడేపల్లి మండలానికి ఈ నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.రహదారుల నిర్మాణం,ప్రయోజనాలు రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లోపం ఉంటే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. రోడ్డు నిర్మాణం జరిగే సమయంలో సంబంధిత అధికారులు తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. సరైన రహదారుల నిర్మాణం ఉన్న ప్రాంతంలోనే అభివృద్ధి అధికంగా జరుగుతుందని తెలిపారు. ఆయన శంకుస్థాపన చేసిన రోడ్ల వివరాలు:గానుగబండ నుంచి పర్ రెడ్డిగూడెం గ్రామం వరకు: రూ.1.40 కోట్లతో 2కి.మీ.గానుగబండ నుంచి మఠంపల్లి మండలం హనుమంతుల గూడెం వరకు:రూ.3.5 కోట్లతో5కి.మీ. కల్మలచెరువు నుంచి చెవ్వారిగూడెం మీదుగా దర్శించర్ల వరకు:రూ.3.5 కోట్లతో 4.6కి.మీ.కల్మలచెరువు నుంచి గానుగబండ వరకు: రూ.2.8 కోట్లతో 4కి.మీ.కల్మలచెరువు నుంచి సబ్ స్టేషన్ వరకు: రూ.4.2 కోట్లతో 6 కి.మీ.కల్మలచెరువు నుంచి బత్తలపాలెం వరకు: రూ.3.5 కోట్లతో 5కి.మీ. కల్మలచెరువు నుంచి సోమల తండా వరకు రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించారు.మండల నాయకులపై మంత్రి అసహనం గానుగబండ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కనీసం మైక్ >>2

## వాసవీ అమ్మవారికి కోట్ల కరెన్సీతో అలంకారం





**విజయవాడ,సెప్టెంబర్27:**ఉభయ తెలుగు రాష్ట్రాల్లో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.ప్రతి రోజు అమ్మవారిని భిన్నమైన రూపంలో అలంకరించి భక్తులకు దర్శనమిస్తున్నారు.ఈ ప్రత్యేక అలంకరణలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచేస్తున్నాయి.ప్రత్యేకంగా వాసవీ మాత ఆలయాల్లో కరెన్సీ నోట్లతో అలంకరణ విశేషఆకర్షణగా మారింది.భారీ సంఖ్యలోనోట్లతో అమ్మవారినిఅలంకరించడం ప్రతిసంవత్సరం సంప్రదాయంగా మారింది.ఈసారి ఆ భవ్య అలంకరణ మరింత వైభవంగా జరిగింది.ఆంధ్రప్రదేశ్ కోనసీమజిల్లా అమలాపురంలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయం ప్రత్యేకంగా అలరించింది. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని మహాలక్ష్మి రూపంలో అలంకరించారు. భక్తుల కోసం ఆలయం అంతా కరెన్సీ నోట్లతో అలంకరించబడింది.కోట్ల రూపాయల విలువైన నోట్లతో అలంకరణ ఈసారి ఆలయంలో ప్రత్యేక అలంకరణ చరిత్ర సృష్టించింది. ఏకంగా 4 కోట్లు 42 లక్షల రూపాయల విలువైన కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు.ఒక్క రూపాయి కూడా తక్కువ లేకుండా ఈ మొత్తం ఖర్చు చేయడం విశేషం.ఈ అలంకరణ ఆలయ చరిత్రలో గుర్తుండిపోయే ఘట్టంగా నిలిచింది.ఈ ప్రత్యేక అలంకరణను చూసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఆలయం భక్తులతో నిండిపోయి కిటకిటలాడింది.బారులు తీరుతూ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ దృశ్యం పండుగ వాతావరణాన్ని మరింత అందంగా మార్చింది.భద్రతా చర్యలు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నిర్వాహకులు కఠిన భద్రతా చర్యలు చేపట్టారు. పోలీసులు, వాలంటీర్లు ఆలయం చుట్టూ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శనం చేసుకునేలా మార్గాలను సక్రమంగా ఏర్పరిచారు.ఈ ప్రత్యేక అలంకరణ దృశ్యాలు సోషల్ మీడియాలో కూడా వైరల్ అయ్యాయి.వీడియోలు,ఫోటోలు పెద్ద ఎత్తున షేర్ అవుతూ చర్చనీయాంశంగా మారాయి.ఈ అద్భుత అలంకరణను చూసి భక్తులు ఆశ్చర్యపోతున్నారు.ఉత్సవాల వైభవంతెలుగు రాష్ట్రాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రతిచోటా ప్రత్యేకంగా సాగుతున్నాయి.ప్రతి ఆలయం >>2

# హైదరాబాద్ కమిషనర్‌గా సజ్జనార్

అనిల్ కుమార్‌ను నియమించారు.హోంశాఖ స్పెషల్ సెక్రటరీగా సందీప్ కుమార్ ఝా అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్‌గా విక్రమ్ సింగ్ నియమితులయ్యారు.హైదరాబాద్ క్రైమ్ అడిషనల్ సీపీగా శ్రీనివాసులు,అడిషనల్ సీపీ (శాంతిభద్రతలు)గా తసఫీర్ ఇక్బాల్ బదిలీ అయ్యారు. వెస్ట్ జోన్ డీసీపీగా అనురాధ,సిద్దిపేట సీపీగా విజయ్ కుమార్, నారాయణ పేట్ ఎస్పీగా వినీత్ బదిలీ అయ్యారు.రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌దా సందీప్ కుమార్ ఝా స్థానంలో హరితను నియమించారు.హోంశాఖ స్పెషల్ సెక్రటరీగా సందీప్‌కుమార్ ఝాకు బాధ్యతలు అప్పగించారు.రవాణా శాఖ కమిషనర్‌గా రఘునందన్ రావు నియమితులయ్యారు.మరోసారి యూనిఫాం పోస్టులోకి బదిలీ అయ్యారు వ్యవసాయ శాఖ కార్యదర్శిగా సురేంద్ర మోహన్‌కు బాధ్యతలు కట్టబెట్టారు.సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన సజ్జనార్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా 2021 ఆగస్టులో బాధ్యతలు స్వీకరించారు.ఆయన నేతృత్వంలో నష్టాల్లో ఉన్న సంస్థను తిరిగి లాభాల వైపు మళ్లించడానికి, ఉద్యోగులసంక్షేమం,ప్రయాణికుల సేవలను మెరుగుపరచడానికి అనేక కీలక సంస్కరణలు,కార్యక్రమాలు చేపట్టారు. తాజాగా ఆయన మరోసారి యూనిఫాం పోస్టులోకి బదిలీ అయ్యారు. ఇక తెలంగాణ కొత్త డీజీపీగా శవధర్ రెడ్డి నియమితులైన సంగతి తెలిసిందే. ఈ నెలాఖరుకు ప్రస్తుత డీజీపీ జితెందర్ బదిలీ కానుండగా.. ఆయన స్థానంలో శవధర్ రెడ్డి డీజీపీగా కొనసాగనున్నారు.

# 17 కోట్లతో పలు రోడ్లకు శంకుస్థాపన

పట్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు.కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్న పనులను ప్రజలకు వివరించకుంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు.తమ పర్యటనకు వచ్చినప్పుడు తనతోపాటు ఉండేందుకు నాయకులు చూపిస్తున్న శ్రద్ధ గ్రామాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై చూపించడం లేదని అభిప్రాయపడ్డారు.ఈ విషయంలో మరోసారి లోపం జరగకుండా మండల పార్టీ బాధ్యులు చూసుకోవాలని ఆయన చురకలు అంటించారు.

# వాసవీ అమ్మవారికి కోట్ల కరెన్సీతో అలంకారం

తమకంటూ ప్రత్యేకతను ప్రదర్శిస్తోంది.అయితే కోనసీమలో జరిగిన ఈ కరెన్సీ నోట్ల అలంకరణ మాత్రం అందరి దృష్టిని ఆకర్షించింది.శరన్నవరాత్రులు భక్తి,వైభవం కలిసిన పండుగలు.అమ్మవారికి చేసే అలంకరణలు ఆధ్యాత్మికతను మరింత పెంచుతున్నాయి.కోట్ల రూపాయల విలువైన కరెన్సీ నోట్లతో చేసిన ఈ అలంకరణ భక్తుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

# ఎంబీజీఎస్ నుంచి బస్సుల రాకపోకలు బంద్

బస్సులను ఇతర ప్రాంతాల నుంచి తిప్పుతున్నామని.ఆయా మార్గాల ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని చెప్పింది. ఇతర వివరాలకు టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040 69440000, 04023450033 సంప్రదించాలని ఆర్టీసీ యాజమాన్యం సూచించింది.ఇక శుక్రవారం అర్ధరాత్రి తర్వాత మూసీకి వరద పెరిగింది.దీంతో ఎంజీబీఎస్ బస్ స్టేషన్‌లోకి భారీగా నీరు చేరింది.దీంతో అధికారులు,పోలీసులు తాడు సహాయంతో ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారు.ప్రస్తుతం చాదర్ ఘాట్ వద్ద బ్రిడ్జిని మూసేసారు.పరిహాహక ప్రాంతాల్లోకి భారీగా వరద చేరుతుండటంతో స్థానికులకు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.హైదరాబాద్ నగరంలో భారీ వర్షం నేడు కూడా హైదరాబాద్ నగరంలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ప్రజలకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు.

# ఎలుగుబంటి దాడి లో దంపతులు మృతి

ఇప్పిస్తామని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.ఫోరానిక్స్ వారు ఇచ్చిన సమాచారంతో మృతులు ఎలుగుబంటి దాడిలో మరణించినట్లు ఎఫ్డిఓ సుశాంత్ కుమార్ తెలిపారు.అటవీ శాఖ ఆధ్వర్యంలో ఒకరికి పదిలక్షలచొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తామన్నారు.ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు బాధిత కుటుంబానికి పదివేల రూపాయల అందించారు.

# 30న అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ 26వ స్నాతకోత్సవం

ప్రేమావత్లకు గౌరవ డాక్టరేట్లు ఇవ్వనున్నట్టు ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి తెలిపారు. డిగ్రీలో 35, పీజీలో 51బంగారు పతకాలు,ఇద్దరు ఖైదీలకు బంగారు పతకాలను ఇవ్వనున్నట్టు చెప్పారు.గవర్నర్,విశ్వవిద్యాలయ ఛాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ స్నాతకోత్సవంలో పాల్గొంటారని తెలిపారు.విద్యార్థులకు ఎం.ఫిల్, పిహెచ్.డి పట్టాలు, ఆయా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బంగారు పతకాలు, బుక్ ప్రైజులు అందించనున్నట్లు వివరించారు.పట్టాలు అందుకోనున్న అభ్యర్థులు 26వ స్నాతకోత్సవంలో 60,288 మంది అభ్యర్థులు తమ డిగ్రీలు, డిప్లొమా సర్టిఫికెట్లు పొందనున్నారు. ఇందులో అండర్‌గ్రాడ్యుయేట్‌లో 35,346 మంది, పోస్ట్‌గ్రాడ్యుయేట్‌లో 24,942 మంది సర్టిఫికెట్లు అందుకోనున్నారు. అదేవిధంగా, వివిధ జైళ్లలో విద్యాభ్యసించిన 203 మంది ఖైదీ అభ్యర్థులు కూడా డిగ్రీలు, పట్టాలు పొందనున్నారు.

# ఒడిశాలో రూ. 60,000 కోట్ల అభివృద్ధి

లైన్ విస్తరణ వంటి ప్రాజెక్టులు కనెక్టివిటీని పెంచుతాయి. ఈ ప్రాజెక్టులు ఒడిశాతో పాటు పొరుగు రాష్ట్రాల మధ్య రవాణా,పరిశ్రమలు,వాణిజ్యానికి ఊతమిస్తాయి.అలాగే, బెర్హాంపూర్-ఉధ్నా (సూరత్) మధ్య అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధాని జెండా ఊపి ప్రారంభించారు.ఈ రైలు రాష్ట్రాల మధ్య ప్రయాణాన్ని సులభతరం చేసి, పర్యాటకానికి తోడ్పడుతుంది.ఉపాధి అవకాశాలను పెంచుతుంది.ఆరోగ్యరంగంలో భాగంగా బెర్హాంపూర్‌లోని మెడికల్ కాలేజీ,సంబల్పూర్‌లోని లను ప్రపంచ స్థాయి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులుగా అప్‌గ్రేడ్ చేయడానికి శంకుస్థాపన చేశారు.ఈ ప్రాజెక్టులు ఒడిశా ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలను అందించనున్నాయి.

# శీతల్ దేవికి గోల్డ్ మెడల్



**న్యూఢిల్లీ,సెప్టెంబర్27:** 18 ఏళ్ల భారతీయ క్రీడాకారిణి శీతల్ దేవి తన అద్భుత ప్రతిభతో ప్రపంచ చాంపియన్గా నిలిచింది. ఈ క్రీడాకారిణి సాధారణ పరిస్థితుల్లోనే కాక,శారీరక సవాళ్లను అధిగమిస్తూ విజయం సాధించడం మరింత చరిత్రాత్మకంగా మారింది.రెండు చేతులు లేకపోయినప్పటికీ,శీతల్ దేవి తన కాళ్ల ద్వారా బాణాన్ని వదిలి,పారా ప్రపంచ ఆర్చరీ పోటీల్లో స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది.టర్కీకి చెందిన వరల్డ్ నెంబర్ వన్ క్రీడాకారిణి జోజ్నూర్ క్యూర్ గిర్డీ పై 146143 పాయింట్లతో విజయం సాధించింది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత కేటగిరీలో శీతల్ దేవి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నది.పారా వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో శీతల్ దేవి ఒక్కరే చేతులు లేని క్రీడాకారిణి. ఆ దివ్యాంగ క్రీడాకారిణి .. గ్వాంగ్‌జులో అందర్నీ స్టన్ చేసింది.తన పాదం, గదవతో శీతల్ తన బాణాన్ని షూట్ చేస్తుంది.ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మూడోసారి శీతల్ దేవి మెడల్‌ను గెలుచుకున్నది. మిక్స్‌డ్ టీమ్ బ్రాంజ్ కాంపౌండ్ ఈవెంట్ లో తోమన్ కుమార్‌తో కలిసి పతకాన్ని సాధించింది.

# సీఎం స్టాలిన్‌పై నటుడు విజయ్ వివాదాస్పద వ్యాఖ్యలు..పోలీసులకు ఫిర్యాదు



**చెన్నై,సెప్టెంబర్27:** తమిళ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ప్రముఖ నటుడు,తమిళిగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ తన రాజకీయ జీవితం ప్రారంభంలోనే ఒక పెద్ద ఎదురుదెబ్బను ఎదుర్కొన్నారు.ఇటీవల ఆయనపై పోలీసులకు ఫిర్యాదు నమోదు చేయబడినట్టు సమాచారం. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్,ఆయనకుటుంబ సభ్యులను కించపరిచేలా పరువునష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై పోలీసులకు ఫిర్యాదు అందింది.డీఎంకేకు చెందిన న్యాయవాది ఎన్.మురళీ కృష్ణన్ ఈ మేరకుతిరుచ్చి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదులో పేర్కొన్న వివరాలప్రకారం,సెప్టెంబర్ 20వతేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో విజయ్ తన ప్రసంగంలో సీఎం స్టాలిన్‌ను,ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని అవమానకరమైన వ్యాఖ్యలు చేశారని మురళీకృష్ణన్ ఆరోపించారు. కేవలం తన రాజకీయ ప్రయోజనాల కోసం విజయ్ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన తన ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలు చేశారు. విజయ్‌పై తక్షణమే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వచ్చే ఏడాది తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామంప్రాధాన్యత సంతరించుకుంది. మరోసారి అధికారాన్ని నిలబెట్టుకోవాలని డీఎంకే ప్రయత్నిస్తుండగా,ఈసారి ఎలాగైనా గెలవాలని ఎన్డీఏ కూటమి పట్టుదలగా ఉంది.ఇదే సమయంలో తన కొత్త పార్టీతో ఎన్నికల బరిలోకి దిగి సత్తా చాటాలని విజయ్ భావిస్తుండగా,ఈ ఫిర్యాదు ఆయనకు రాజకీయంగా ఇబ్బందులు సృష్టించే అవకాశం కనిపిస్తోంది.

# మైక్రోసాఫ్ట్ అధికారిణి లీసా మొనాకోను వేటు వెయ్యాల్లన్న ట్రంప్



**వాషింగ్టన్,సెప్టెంబర్27:**అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ఆ సంస్థలో గ్లోబల్ అఫైర్స్ హెడ్‌గా ఉన్న లీసా మొనాకోను వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.ఆమెను అవినీతిపరురాలు"గా అభివర్ణిస్తూ,అమెరికా జాతీయ భద్రతకు పెద్ద ముప్పు"అని ఆరోపించారు.సోషల్ మీడియాలో ట్రంప్ ఆరోపణలు ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్లో పోస్టు చేస్తూ, మైక్రోసాఫ్ట్ ప్రభుత్వ కాంట్రాక్టులు పొందుతున్న సంస్థ కాబట్టి,లీసాకు సున్నితమైన సమాచారం చేరే అవకాశం ఉందని,అందువల్ల ఆమెను నమ్మరానిదని పేర్కొన్నారు.అంతేకాకుండా,ఆమెకు ఉన్న భద్రతా అనుమతులను రద్దు చేసి,ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రవేశాన్ని నిషేధించినట్లు వెల్లడించారు.లీసా మొనాకో గత బాధ్యతలుఈ ఏడాది మేలో మైక్రోసాఫ్ట్‌లో చేరకముందు, లీసా మొనాకో జో బైడెన్ ప్రభుత్వంలో 39వ డిప్యూటీ అటార్నీ జనరల్‌గా పనిచేశారు. అటార్నీ జనరల్ మెరిక్ గార్లాండ్ కింద ఆమె కీలక బాధ్యతలు నిర్వహించారు. బైడెన్ ప్రభుత్వంలో పనిచేసిన అనుభవమే ట్రంప్ అసంతృప్తికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. హెచ్1బీ వీసాల వివాదం నేపథ్యంలో ప్రాధాన్యం ఇటీవల ట్రంప్ ప్రభుత్వం హెచ్1బీ వీసాలపై భారీ ఫీజు విధించిన తర్వాత, మైక్రోసాఫ్ట్ సహా పలు టెక్ కంపెనీలు అసహనం వ్యక్తం చేశాయి. ఈ నెల 21 నుంచి అమల్లోకి రానున్న కొత్త నిబంధనల వల్ల, విదేశాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను తక్షణమే వెనక్కి రమ్మని మైక్రోసాఫ్ట్ సూచించింది. ఈ పరిణామాల నడుమ ట్రంప్ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ప్రభుత్వ అలసత్వమే వరద దుస్థితికి కారణం



**హైదరాబాద్,సెప్టెంబర్27:** హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా నగరం జలదిగ్బంధంలో చిక్కుకుపోయిన పరిస్థితిపై మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరికలు జారీ చేసినా,ప్రభుత్వం సకాలంలో చర్యలు తీసుకోలేకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు.ప్రభుత్వం సమన్వయం లోపించింది"వరద పరిస్థితులను అంచనావేయడంలో,ప్రణాళికలు రచించడంలో,విభాగాల మధ్య సమన్వయం సాధించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు పేర్కొన్నారు.ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు.పండుగ సమయాల్లో ఊర్లకు వెళ్తున్న ప్రయాణికులు ఎంజీబీఎస్ బస్టాండ్‌లో వరద నీటిలో ఇరుక్కుపోయి రాత్రంతా భయంతో గడపాల్సి వచ్చిందని ఆయన ఆవేదనవ్యక్తం చేశారు.మూసీ పరిసర ప్రాంతాలు ముంపు ప్రమాదంలో"మూసీ నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో పరివాహక ప్రాంతాల ప్రజలు ప్రాణాలను పణంగా పెట్టుకుని బతుకుతున్నారని ఆయన అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయాలు పక్కన పెట్టి సహాయక చర్యలపై దృష్టి సారించాలని హరీశ్‌రావు సూచించారు.సహాయక చర్యలు వేగవంతం చేయాలని డిమాండ్ వరదల్లో చిక్కుకున్నవారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ముంపు ప్రమాదంలో ఉన్న కుటుంబాలను ముందుగానే గుర్తించి వారికి భరోసా కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.




# స్టీల్ ప్లాంట్ కూలి ఐదుగురు కార్మికుల దుర్మరణం

**ఛత్తీస్‌గఢ్,సెప్టెంబర్27:**ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో దారుణమైన ప్రమాదం చోటుచేసుకుంది. రాజధాని శివార్లలోని సిల్తారా ప్రాంతంలో ఉన్న గోదావరి ఇస్పాత్ లిమిటెడ్ స్టీల్ ప్లాంట్‌లో ఒక నిర్మాణం కూలిపోవడంతో ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.ఈ ప్రమాదంలో అనేక మంది కార్మికులు గాయపడ్డారు.సమాచారం అందుకున్న అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు.ఐదుగురు మృతి, గాయపడిన వారు ఈ ఘటనపై ఒక సీనియర్ పోలీసు అధికారి మాట్లాడుతూ,ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పోలీసు బృందాన్ని సంఘటనా స్థలానికి పంపాం. సహాయక చర్యలు ప్రారంభించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం,ఐదుగురు కార్మికులు మరణించారు. మరో ఐదుగురు గాయపడ్డారు" అని ఆయన తెలిపారు. గాయపడిన కార్మికులను అధికారులు తక్షణమే ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.కొనసాగుతున్న సహాయక చర్యలుప్రమాదం జరిగిన ప్రాంతంలో మరికొంత మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. దీంతో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. శిథిలాలను తొలగించి, చిక్కుకున్న వారిని బయటకు తీయడానికి అధికారులు, రెస్క్యూ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ప్లాంట్‌లోని నిర్మాణం ఎందుకు కూలిపోయింది అనే విషయంపై దర్యాప్తు జరుగుతోంది.

# హెచ్1బీ వీసా..డాలర్ కలలకు యువత దూరం




**న్యూఢిల్లీ,సెప్టెంబర్27:**హెచ్1బీ వీసా: అమెరికన్ కలపై భారమైన దంచింపు హెచ్1బీ వీసా బీ1 అనేది ప్రపంచవ్యాప్తంగా,ముఖ్యంగా భారతీయ సాంకేతిక నిపుణుల జీవితాలను మార్చిన ఒక కీలక వీసా.ఈ వీసా ద్వారా ఇక్కడి ప్రతిభావంతులు అమెరికా ఉద్యోగ అవకాశాలను సులభంగా పొందుతారు.ఇంతకాలం 2,000-5,000 డాలర్ల పరిధిలో ఉండే ఫీజును అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లక్ష డాలర్లకు పెంచే విధానం ప్రవేశపెట్టారు.ఈ నిర్ణయం లక్షలభారతీయ వలసదారుల అమెరికన్ డ్రీమ్"నుతీవ్రముగా ప్రభావితంచేస్తుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.హెచ్1బీ వీసా పై ఆధారపడిన చాలా ప్రముఖ టెక్ దిగ్గజాలు ఉన్నాయి.ఎలాన్ మస్క్, సత్య నాదెళ్ల,సుందర్ పిచాయ్ వంటి ప్రముఖులు తమ కెరీర్ ప్రారంభంలో ఈ వీసాకు ఆధారపడి అమెరికాలో అవకాశాలను సంపాదించారు.మస్క్ స్పేస్ఎక్స్,టెస్లా వంటి విప్లవాత్మక సంస్థలను నిర్మిస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన నిపుణులను అమెరికాలోకి ఆహ్వానించారు. సత్య నాదెళ్ల మైక్రోసాఫ్ట్ లో దినివీగా చేరి,కంపెనీకి నూతనశిఖరాలను అందించారు.సుందర్ పిచాయ్ గూగుల్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,క్లౌడ్ సర్వీసులు మరియు పిక్సెల్ ఫోన్ల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.అమెరికన్ డ్రీమ్" ఈ కొత్త ఫీజు విధానం చిన్న మరియు మధ్య తరహా టెక్ కంపెనీలకు విదేశీ ప్రతిభను ఆకర్షించడం దాదాపు అసాధ్యంగా మారుస్తుంది.పెద్దకంపెనీలు మాత్రమే ఈభారాన్ని మోసగలుగుతాయి.ఈ ప్రభావం, ఆవిష్కరణల వేగాన్ని నెమ్మదిగా చేయడమే కాకుండా, అమెరికాలో నైపుణ్యాల కొరతకు దారితీస్తుందనే భయాంకర అంచనాలు ఉన్నాయి.భారత్ ప్రభుత్వం ఈ నిర్ణయంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇదికేవలం ఆర్థికప్రభావం మాత్రమే కాదు,మానవతా సంక్షోభానికి దారితీయే ప్రమాదం ఉందని భారతవిదేశాంగ శాఖహెచ్చరించింది.ఇప్పటికే అమెరికాలో ఉద్యోగం పొందిన వలసదారుల కుటుంబాలు, విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశముందని పేర్కొంది.భారత్ ఈ సమస్యపై దౌత్య చర్చలద్వారా పరిష్కారం కనుగొనడానికి ప్రయత్నిస్తోంది.వివిధ విశ్లేషకులు, సాంకేతిక పరిశ్రమ వర్గాలు హెచ్1బీ వీసా మరింత కఠినతరం చేయడంపై తీవ్రమైన విమర్శలు చేస్తున్నారు.వారు అంటున్నారు,ఈ వీసా విధానం కేవలం ఒక వ్యక్తికి ఉద్యోగం కల్పించే వీసా మాత్రమే కాక,అమెరికా ఆర్థిక వ్యవస్థ,ప్రపంచ సాంకేతిక ఆధిపత్యానికి ఎంతో ముఖ్యమైనది.ఈ విధంగా,హెచ్1బీ వీసా బీ1 పై తాజా నిర్ణయం భారతీయ వలసదారుల అమెరికన్ డ్రీమ్"కు ప్రతికూల ప్రభావం చూపుతుందని స్పష్టంగా చెబుతున్నారు నిపుణులు.

# మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు - కంపౌండింగ్ శక్తి

సేవింగ్స్ కోసం చాలా మంది మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడుతున్నారు. వీటిలో ఇన్వెస్ట్ చేయడం వల్ల ఎక్కువ కాలంలో గణనీయమైన రాబడులు వస్తాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఈ లాభాలకు ప్రధాన కారణం కంపౌండింగ్.పెట్టుబడిపై వచ్చిన మొదటి సంవత్సర వడ్డీ లేదా లాభం ప్రిన్సిపల్‌లో కలిసిపోతుంది. ఆ పెరిగిన మొత్తంపైనే తదుపరి సంవత్సరంలో మళ్లీ లాభం వస్తుంది. ఇలా"వడ్డీ మీద వడ్డీ"గా డబ్బు పెరుగుతూ పోతుంది. అందుకే దీర్ఘకాలిక పెట్టుబడులలో కంపౌండింగ్ ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రపంచ ప్రఖ్యాత పెట్టుబడిదారుడు వారెన్ బఫెట్ కూడా కంపౌండింగ్ శక్తిని పలు సందర్భాల్లో ప్రస్తావించారు.ఆర్థిక లక్ష్యాలను సాధించాలంటే పెట్టుబడిని ఎక్కువ కాలం కొనసాగించడం అవసరం.దీనికి కోటక్ మిడ్ క్యాప్ ఫండ్‌డైరెక్ట్ స్కీమ్ మంచి ఉదాహరణ.3 సంవత్సరాల్లో రూ.1లక్ష పెట్టుబడి దాదాపు రూ.1.86 లక్షలకు పెరిగింది (ప్రతి సంవత్సరం సగటు 23.16రాబడి).5 సంవత్సరాల్లో అదే పెట్టుబడి రూ.3.72 లక్షలకు పెరిగింది (సుమారు 30వార్షిక రాబడి).10 సంవత్సరాల్లో పెట్టుబడి రూ.6.04 లక్షలకు పెరిగింది (సగటు 19.72 వార్షిక రాబడి).2013లో ఫండ్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సంవత్సరానికి సగటు 21.13 రాబడి ఇచ్చి రూ.11.48 లక్షలకు పెరిగింది.ఈ ఫండ్‌లో ప్రధానంగా మిడ్‌క్యాప్ స్టాక్స్ (69.16 ), స్మాల్‌క్యాప్ స్టాక్స్ (14.66 ), లార్జ్‌క్యాప్ స్టాక్స్ (14.06 ) ఉన్నాయి. అలాగే ఐటీ సాఫ్ట్‌వేర్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఫైనాన్స్, రిటైల్, ఆటో కాంపోనెంట్స్, హెల్త్‌కేర్ రంగాల్లో పెట్టుబడులు ఉన్నాయి. దీర్ఘకాలంలో ఇవి మంచి లాభాలను అందిస్తున్నాయి.

## దసరా పండుగ.. విజయవాడ హైవేపై ట్రాఫిక్ నరకం



**హైదరాబాద్,సెప్టెంబర్27:** దసరా పండుగ సందర్భంగా నగరవాసులు తమ స్వగ్రామాలకు తరలివెళ్లడంతో బస్‌స్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. సొంత వాహనాలు కూడా భారీగా రోడ్ల మీదకు రావడంతో విజయవాడ హైవేపె ట్రాఫిక్ జామ్ నెలకొంది.కిలోమీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.హయత్‌నగర్ ప్రాంతంలో వాహనాలు నెమ్మదిగా ముందుకుసాగుతున్నాయి.అదే విధంగా,ఉప్పల్ చౌరస్తా వద్ద కూడా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.భారీ వర్షాల కారణంగా వరద ఉధృతి ప్రయాణికుల రద్దీ ఒకవైపుఉండగా,అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గౌరెల్లి వద్ద భారీ వర్షాల కారణంగా వరద ఉధృతి ఏర్పడింది.వంతెనపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.వంతెన వద్ద వాహనాల నిలిపివేత వరద ఉధృతి కారణంగా ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అధికారులు వెంటనే స్పందించి వంతెన వద్ద బారికేడ్లను ఏర్పాటు చేశారు.స్థానికులను అప్రమత్తం చేశారు.దీంతో వంతెనకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.ఇది విజయవాడ హైవేపై రద్దీని మరింత పెంచింది.

## చైనాలో భూకంపం.. పరుగులు తీసిన ప్రజలు



ఇటీవలకాలంలో ప్రకృతి వైపరీత్యాలు బాగా పెరిగిపోతున్నాయి.ఒకవైపు అధికవర్షాలు, వరదలు,కొండచరియలు విరిగిపడడం,క్లౌడ్ బరస్ట్‌వంటి సంఘటనలతో పాటు భూకంపాలు కూడాపెరుగుతున్నాయి.అఫ్ఘనిస్తాన్,మయన్మార్, థాయ్లాండ్,జపాన్ వంటి దేశాల్లో భారీ భూకంపాలతో ఎంతోమందిమరణించారు.తాజాగా శనివారం ఉదయం వాయువ్య చైనాలోని గన్సుప్రావిన్స్ లో 5.6 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది.చైనా భూకంప నెట్‌వర్క్ సెంటర్ ప్రకారం.చైనా భూకంప నెట్‌వర్క్ సెంటర్ ప్రకారం డింగ్సీ నగరంలోని లాంగ్జీ కౌంటీలో ఉదయం 5 ఫ49 గంటలకు భూకంపం సంభవించింది.దీని తీవ్రత రిక్టర్ స్కేలు పై నమోదైంది. భూకంప కేంద్రం 10 కిలోమీటర్లలో తులోఉంది.ఒక్కసారిగా భూకంపం రావడంతో ప్రజలు ఆందోళన చెందారు. భయంతో పరుగుతు తీశారు.అయితే ఈభూకంపంవల్ల ఎలాంటి పాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు.కొన్ని భవనాలు నేలమట్టం అయ్యాయి.కానీ ఎవరూ మరణించకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



## ఇంద్రకీలాద్రి అమ్మవారిని దర్శించుకున్న నందమూరి బాలకృష్ణ




**విజయవాడ, సెప్టెంబర్27:** విజయవాడ ఇంద్రకీలాద్రి వద్ద ప్రసిద్ధి గాంచిన దుర్గామాత ఆలయానికి శనివారం హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇంద్రకీలాద్రిపై సందడి చేశారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా కనకదుర్గమ్మను దర్శించుకుని,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ భక్తులకు ఆనందాన్ని పంచారు.నివారం ఆలయానికి చేరుకున్న బాలకృష్ణను ఆలయ కమిటీ ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్,అర్చకులు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు.అనంతరం అమ్మ వారిని దర్శించుకుని పూజాకార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ అమ్మవారి చిత్రపటాన్ని అందజేసినన్మాని ంచారు.దర్శనం అనంతరం బాలకృష్ణ మీడియా తో మాట్లాడారు.లలితా త్రిపురసుందరీ దేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉంది.రాష్ట్ర ప్రజలందరిపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాను"అని ఆయన తెలిపారు.అమ్మవారి దృష్టిలో అందరూ సమా నమేనని, ఆమె ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగాలని ఆకాంక్షించారు.దసరా ఉత్సవాల ఏర్పాట్లను బాలకృష్ణ ప్రత్యేకంగా ప్రశంసించారు ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల ఏర్పాట్లను బాలకృష్ణ ప్రత్యేకంగాప్రశంసించారు. సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్నిచర్యలుతీసుకున్నా రని కొనియాడారు.భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని,నిరంతరాయంగా దర్శనం కల్పించడం అభినందనీయమని దేవస్థానం అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



## రొమాన్స్ స్కామ్ ముఠాలపై స్టింగ్ ఆపరేషన్.. వందల్లో అరెస్టులు

**హైదరాబాద్, సెప్టెంబర్27:** సైబర్ నేరగాళ్ల ఆగడాలు రోజురోజుకూ శృతిమించిపోతున్నా యి.ఆన్లైన్ మోసాలకు పాల్పడుతూఅందినకాడికి దోచేసుకుంటున్నారు.పద్నాలుగుఆఫ్రికన్ దేశాల్లో నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్ లో 260మంది అనుమానిత సైబర్ మోసగాళ్లను అరెస్టు చేశారు.యూకే నిధులతో,ఇంటర్ పోల్ ఒక ఆపరేషన్ నిర్వహించింది.ఇందులో సోషల్ మీడియా,ఆన్ లైన్ ప్లాట్ ఫామ్ల ద్వారా మోసాలకు పాల్పడేవి.ఘనా,కెన్యా,అంగోలా ఇతర ప్రాంతాలలో 1,400 మందికిపైగా బాధితులను గుర్తించారు.వారంతా దాదాపు 2.8 మిలియన్ డాలర్ల (రూ.23 కోట్ల నుంచి రూ.24 కోట్ల వరకు నష్టపోయినట్లు ఇంటర్ పోల్ అంచనా వేసింది.ఇంటర్ పోల్ తెలిపిన వివరాల ప్రకారం..జులై నుంచి ఆగస్టు మధ్య జరిపిన దాడుల్లో వివిధ వయసుల వారు ఈ మోసగాళ్ల బారిన పడినట్లు గుర్తించారు. ఈ ఆపరేషన్‌లో మోసగాళ గ్యాంగులతో సంబంధ మున్నవారిఐపీ అడ్రెస్‌లు,సాంకేతిక పరికరాలు, డొమైన్స్లు,సోషల్ మీడియా ప్రొఫైళ్లను గుర్తించారు. వీటి ఆధారంగా జరిగిన అరెస్టుల అనంతరం యూఎస్బీ డ్రైవ్ లు, సిమ్ కార్డులు, నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఆఫ్రికా వ్యాప్తంగా 81 సైబర్ నేరగాళ్ల గ్యాంగులను కట్టడి చేసినట్లు ఇంటర్ పోల్ తెలిపింది.ఆన్లైన్ ద్వారా బాధితులపై దాడి చేసే గ్యాంగులను నివారంచడం,వాటిని నిర్వీర్యం చేయడమే మాప్రధాన లక్ష్యం అని పేర్కొంది.
సెక్స్ టార్షన్,రొమాన్స్ స్కామ్ లవంటి సైబర్ నేరాల్లో ఆఫ్రికా అంతటా గణనీయమైన పెరుగుదల నమోదైందని సైబర్ నేర విభాగాల ని వేదికల ద్వారా తెలుస్తోంది అని ఇంటర్ పోల్ లో పోలీస్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిరిల్ గౌట్ తెలిపారు.ఘనాలో 68 మంది అరెస్టులుఘనాలో దాదాపు 68 మంది అనుమానితులను అరెస్టు చేశారు. అక్కడ 835 పరికరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నా రు.ఆపరేషన్ సమయంలో 108మంది బాధితులను గుర్తించారు.బాధితులు దాదాపు 450,000 (రూ4కోట్లు కోల్పోయారు.ఇందులో 62లక్షల రూపాయలను రికవరీ చేయగల్గారు. ఘనాలోని స్కామర్లు ప్రజలను వివిధ మార్గాల్లో మోసం చేశారు.నకిలీ కొరియర్ లేదా కస్టమ్ షిప్మెంట్ ఫీజుల వంటి రూపంలో.అలాగే చాట్ ల సమయంలో వ్యక్తిగత వీడియోలను రికార్డు చేసి,వాటితో బ్లాక్మెయిల్ చేశారు.ఈ గ్యాంగ్ సెలబ్రిటీలుగా మారి, సోషల్ మీడియా,డేటింగ్ సైట్లలో 120 మందిని మోసం చేసి సుమారు రూ 30లక్షల నగదును దోచుకుంది. ఎక్కువగా సోషల్ మీడియా ద్వారానే వీరిని లక్ష్యంగా చేసుకున్నారు స్కామర్లు. నకిలీ పత్రాలు ఉపయోగించి ఫేక్ ఐడెంటిటీలను సృష్టించి, డబ్బు దోచేటప్పుడు తమ నిజమైన గుర్తింపు తెలియకుండా జాగ్రత్తపడ్డారు.సైబర్ నేరాలపై ఆఫ్రికన్ జాయింట్ ఆపరేషన్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన ఈఆపరేషన్‌లో బెనిన్,బుర్కినాఫాసో, దిగాంబియా,గినియా,కెన్యా,నైజీరియా, రువాం డా,దక్షిణాఫ్రికా,ఉగాండా,జాంబియా దేశాలు కూడా పాల్గొన్నాయి.

## ది ప్యారడైజ్.. మోహన్ బాబు ఫస్ట్ లుక్ విడుదల




**టాలీవుడ్, సెప్టెంబర్27:** నేచురల్ స్టార్ నాని ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజాచిత్రం ది ప్యారడైజ్ సినిమాపై ప్రేక్షకులు ఇప్పటికే ఆసక్తి చూపిస్తున్నారు.దసరా సినిమాతో బ్లాక్‌బస్టర్ హిట్ అందించిన శ్రీకాంత్ ఓదెల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు.గ్లోబల్ ఆడియన్స్ ను టార్గెట్ పెట్టుకొని,అత్యున్నత స్థాయిలో ఈసినిమాని రూపొందిస్తున్నారు. దానికి తగ్గట్టుగానే స్టార్ కాస్టింగ్, టాప్ టెక్నిషియన్స్ ఈ ప్రాజెక్ట్ లో భాగం అవుతున్నారు.సినిమాలో విలన్ ఎవరనేది మేకర్స్ తాజాగా ప్రకటించారు. ది పారడైజ్ మూవీలో సీనియర్ నటుడు మంచు మోహన్ బాబు కీలక పాత్ర పోషిస్తున్నారని చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి.ఇటీవల మంచులక్ష్మి ఈవిషయాన్ని కన్ఫార్మ్ చేసింది.ఈ క్రమంలో శనివారం ఉదయం మోహన్ బాబు ఈ సినిమాలో నటిస్తున్నారని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.శికంజా మాలిక్ అనే పాత్రలో లెజెండరీ మోహన్ బాబు నటిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. సోషల్ మీడియా వేదికగా ఫస్ట్ లుక్ ను కూడా రిలీజ్ చేశారు.ఫస్ట్‌లుక్ లో మోహన్‌బాబు షర్ట్ లేకుండా చైర్ మీద కూర్చొని స్టైల్ గా సిగారెట్ తాగుతూ రగ్గడ్‌లుక్ లోకనిపించారు.బ్యాగ్రౌండ్‌లో తుపాకులు,చేతి కింద పెద్ద కత్తి,చేతులకు అంటిన రక్తం మరకలు చూస్తుంటే.సినిమాలో ఆయనపాత్ర ఎలా ఉంటుందనేది ఓ ఐడియా వస్తుంది.కొన్ని నిజమైన సంఘటనల ఆధారంగానానిని జడల్ అనే పాత్రలో ఇతకముందెన్నడూ చూడని విధంగా ప్రజెంట్‌చేసిన శ్రీకాంత్ ఓదెల.మోహన్ బాబుని కూడా అలానే చూపించారు.ఈ చిత్రం తెలుగుతోపాటుహిందీ,తమిళ,కన్నడ,మలయాళ ం,బెంగాలీ,ఇంగ్లీష్,స్పానిష్ భాషల్లో వచ్చే ఏడాది(2026) మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.ఈ చిత్రం 1980ల కాలంలో హైదరాబాద్‌లో జరిగినకొన్ని నిజమైన సంఘట నలఆధారంగాతెరకెక్కుతున్నట్లుసమాచారం.ఇది ఒక యాక్షన్ థ్రిల్లర్‌కథాంశంతోరూపొందుతోంది.

## ఓడిపోయే మ్యాచ్‌లో గెలిచిన టీమిండియా



**టాలీవుడ్, సెప్టెంబర్26:** ఆసియా కప్ 2025 క్రికెట్ టోర్నీలో టీమిండియా తన జోరును కొనసాగిస్తోంది. ఇప్పటివరకు ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ విజయం సాధించిన భారత జట్టు,వరుసగా ఆరవ విజయాన్ని కూడా నమోదు చేసింది.ఈ సారి ఎదురుగా నిలిచింది ఆసియా క్రికెట్‌లో గట్టి పోటీదారైన శ్రీలంక.శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్ మొదటి బంతి నుంచే ఉత్కంఠభరితంగా సాగింది.ఇరు జట్లూ గెలుపుకోసం ఆఖరి వరకు పోరాడగా,చివరికి సూపర్ ఓవర్ ద్వారా ఫలితం తేలింది.అనంతరం శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో హర్షిత్ రాణా,అర్ష్‌దీప్ సింగ్ సంచలన బౌలింగ్‌తో ఓటమిని తప్పించుకుంది.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 202 పరుగులు చేసింది.అభిషేక్ శర్మ(31బంతుల్లో 8 ఫోర్లు,2 సిక్స్‌లతో 61),తిలక్ వర్మ(34 బంతుల్లో 4 ఫోర్లు,సిక్స్‌తో49నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగగా.సంజూ శాంసన్(23 బంతుల్లో ఫోర్,3 సిక్స్‌లతో39),అక్షర్ పటేల్ (15బంతుల్లో ఫోర్,సిక్స్‌తో 21నాటౌట్) మెరుపులు మెరిపించారు.శ్రీలంక బౌలర్లలో మహీష తీక్షణ,దుష్మంత్ చమీర,వానిందు హసరంగ,డసన్ షనక,చరిత్ అసలంక చెరో వికెట్ తీసారు.అనంతరం శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 202 పరుగులే చేసింది.పాతుమ్ నిస్సంక(58బంతుల్లో7 ఫోర్లు,6 సిక్స్‌లతో 107నాటౌట్) సెంచరీతో చెలరేగగా.కుశాల్ పెరీరా(32బంతుల్లో 8 ఫోర్లు,సిక్స్‌తో 58) హాఫ్ సెంచరీతో రాణించాడు.డసన్ షనక(11బంతుల్లో 2 ఫోర్లు,సిక్స్‌తో 22 నాటౌట్) మెరుపులు మెరిపించాడు.హీరో పాతుమ్ నిస్సంకను క్యాచ్ ఔట్‌గా భారత బౌలర్లలో హార్దిక్ పాండ్యా,కుల్దీప్ యాదవ్,వరుణ్ చక్రవర్తి,అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా తలో వికెట్ తీసారు.ఆఖరి ఓవర్‌లో శ్రీలంక విజయానికి 12 పరుగులు అవసరం కాగా.హర్షిత్ రాణా తొలి బంతికే సెంచరీ హీరో పాతుమ్ నిస్సంకను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. తర్వాతి మూడు బంతుల్లో 5 పరుగులు రాగా.ఐదో బంతిని షనక బౌండరీ తరలించాడు. దాంతో ఆఖరి బంతికి శ్రీలంక విజయానికి మూడు పరుగులు అవసరం కాగా.. రెండు పరుగులు మాత్రమే వచ్చాయి.దాంతో మ్యాచ్ టై అయ్యి సూపర్ ఓవర్ ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది.పాతుమ్ నిస్సంక వికెట్‌తో మ్యాచ్ మలుపు తిరిగింది.సూపర్ ఓవర్‌లో అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్ చేయగా.తొలి బంతికే కుశాల్ పెరీరా(0) ఔటయ్యాడు. తర్వాతి రెండు బంతులకు వైడ్ సాయంతో రెండు పరుగులే రాగా.. నాలుగో బంతికి డసన్ షనక సింగిల్ తీయబోయి రనౌట్ అయ్యాడు. అయితే రనౌట్ కంటే ముందే అంపైర్ క్యాచ్ ఔట్ ఇవ్వగా.. షనక రివ్యూ తీసుకున్నాడు.అంపైర్లు ఆటగాళ్లకు వివరించి చెప్పారు.కానీ బంతి బ్యాట్‌కు తగలకపోవడంతో నాటౌట్‌గా తేలింది.అంపైర్ నిర్ణయం తర్వాత బంతి డెడ్ అవుతుంది. కాబట్టి రనౌట్ లెక్కలోకి రాదు.దాంతో షనక ఔటవ్వకుండా బచాయించాడు.ఈ నిర్ణయం అభిమానులతో పాటు భారత ఆటగాళ్లను అయోమయానికి గురి చేసింది. కానీ అంపైర్లు ఆటగాళ్లకు వివరించి చెప్పారు.కానీ మరుసటి బంతికే షనక క్యాచ్‌ఔటయ్యాడు.దాంతోభారత్‌లక్ష్యంమూడుపరుగులుగానమోదైంది.అనం తరం భారత్ ఒక్క బంతికే మూడు పరుగులు చేసి గెలుపొందింది.ఏకపక్ష మ్యాచ్‌లతో చప్పగా సాగిన ఆసియా కప్ 2025 టోర్నీలో ఈ మ్యాచ్ అసలు సిసలు మజా అందించింది. చరిత్రలో నిలిచిపోయింది.

## లోక చాప్టర్ 2 మూవీ అనౌన్స్‌మెంట్ పూర్తి వివరాలు




**కోలీవుడ్, సెప్టెంబర్27:** మలయాళ చిత్ర పరిశ్రమలో ఇటీవల చిన్న సినిమాగా విడుదలై,బాక్సాఫీస్‌ను కుదిపేసిన చిత్రం లోక చాప్టర్ 1 చంద్ర ప్రస్తుతానికి విశేష చర్చకు దారితీస్తోంది.తెలుగులో కొత్త లోక పేరుతో విడుదలైన ఈ చిత్రం గత నెల 28న విడుదలై,చిన్న సినిమాగా ప్రారంభమైనప్పటికీ అద్భుతమైన కలెక్షన్లతో రికార్డులు తిరగరాసింది.ఇప్పటి వరకు రూ.270 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం ద్వారా,ఇది మలయాళ పరిశ్రమలో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది.ఇందులో కల్యాణి ప్రియదర్శన్ టైటిల్ రోల్‌లో నటించగా.నెస్లన్,చందు,సాయికుమార్ వంటి నటులు ముఖ్య పాత్రల్లో నటించారు. దుల్కర్ సల్మాన్,టొవినో థామస్ ఇందులో అతిథి పాత్రల్లో కనిపించారు.డొమెనిక్ అరుణ్ దర్శకత్వం వహించారు.ఈ చిత్రాన్ని దుల్కర్ సల్మాన్ సొంత బ్యానర్ వే ఫేరర్ ఫిల్మ్ నిర్మించింది.అయితే ఈ సినిమాకు తాజాగా చాప్టర్ 2 ని అనౌన్స్ చేశారు మేకర్స్. ఇందులో దుల్కర్‌తో పాటు టొవినో థామస్ ప్రధాన పాత్రల్లో నటించబోతున్నట్లు తెలుస్తుంది.సెకండ్ చాప్టర్‌కి కూడా డొమెనిక్ అరుణ్ దర్శకత్వం వహించబోతున్నాడు.తాజాగా చాప్టర్ 2 కి సంబంధించిన అనౌన్స్‌మెంట్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది.లోకలో మొత్తం ఐదు సినిమాలు రాబోతున్నట్లు సమాచారం.

## హృదయపూర్వం (జియో హాట్ స్టార్)మూవీ రివ్యూ

**మలయాళ, సెప్టెంబర్27:** మలయాళ సినీ ఇండస్ట్రీలో కుటుంబ చిత్రాలకు పర్యాయపదంగా నిలిచిన దర్శకుడు,సత్యన్ అంతికాడ్,-మోహన్‌లాల్ కాంబినేషన్‌లోవచ్చిన తాజాచిత్రం హృదయపూర్వం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది.ఈ ఏడాది ఆగస్టు 28న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం కేవలం రెండు వారాల వ్యవధిలోనే 100 కోట్లకు పైగా వసూళ్లు సాధించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.మోహన్‌లాల్ మరోసారి తన నటనతో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసాడు.మాళవిక మోహనన్ సంగీత మాధవన్ నాయర్.సంగీత్ ప్రతాప్.సిద్ధికీ ముఖ్యమైన పాత్రలను పోషించిన ఈ సినిమా,ఈ నెల 26వ తేదీ నుంచి జియో హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ అవుతోంది.మరి ఈ సినిమా ఎలా ఉందో చూద్దాం.కథ సందీప్ బాలకృష్ణన్ (మోహన్ లాల్) సిటీలో ఒక కిచెన్ సెంటర్ ను నిర్వహిస్తూ ఉంటాడు. తల్లీదండ్రులను కోల్పోయిన సందీప్,జీవితంలో ఒక తోడు అవసరమని భావిస్తాడు.అయితే పెళ్లికూతురు పారిపోవడంతో పీటలపై పెళ్లి ఆగిపోతుంది.అప్పటినుంచిఅతనుపెళ్లిగురించినఆలోచనచేయడు.ఊహించని విధంగా అతనికి హార్ట్ సర్జరీ జరుగుతుంది. పూణెకి చెందిన రవీంద్రనాథ్ అనే వ్యక్తి గుండెను సందీప్ కి అమర్చుతారు.సందీప్ పూర్తిగా కోలుకున్న తరువాత హాస్పిటల్ నుంచి తిరిగొస్తాడు.సందీప్ కోలుకోవడం అతని బావకి ఎంతమాత్రం ఇష్టం లేని విషయం.ఎందుకంటే ఊహించని విధంగా రేటు పెరిగిన ఆయన స్థలాలను సొంతం చేసుకోవాలనే ఆలోచనలో అతను ఉంటాడు.అలాంటి పరిస్థితులలో సందీప్ ను కలవడానికి హరిత (మాళవిక మోహనన్)వస్తుంది.సందీప్ కి అమర్చిన హార్ట్ తన తండ్రిదేనని చెబుతుంది. పూణెలో జరగనున్న తన ఎంగేజ్ మెంట్ కి రమ్మని ఆహ్వానిస్తుంది.ధనం హాస్పిటల్ వారు తన ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను దగ్గరుండి చూసుకోవడానికిగాను,అసిస్టెంట్‌గా ఇచ్చిన జెర్రీ(సందీప్‌ప్రతాప్)ను వెంటబెట్టుకుని సందీప్ పూణె వెళతాడు.అక్కడే ఆయన మొదటిసారిగా రవీంద్రనాథ్ భార్యను చూస్తాడు.ఎంగేజ్ మెంట్ ఫంక్షన్ కాగానే వెంటనే బయల్దేరి వెళ్లిపోవాలని నిర్ణయించుకుంటాడు.అయితే ఊహించని విధంగా ఆ ఫంక్షన్ లో గొడవ జరుగుతుంది. అందుకు కారణం ఏమిటి? అప్పుడు సందీప్‌ఏం చేస్తాడు?అనేదిమిగతాకథ.సాధారణంగా ఎవరైనాచనిపోతే,వారికి సంబంధించిన అవయవాలను అవి అవసరమైనవారికి అమర్చుతూ ఉంటారు.అయితే చనిపోయిన వ్యక్తి యొక్క కుటుంబ సభ్యులు, ఆ వ్యక్తి అవవయవాలను ఎవరికైతే అమర్చారో వారిని ఎంతగానో అభిమానించడం సహజంగా జరుగుతూ ఉంటుంది. ఆ అవయవాలను పొందినవారికి, కొత్త వ్యక్తులు చూపించే ప్రేమాభిమానాలు చిత్రంగా అనిపిస్తూ ఉంటాయి.విశ్లేషణ అలాంటి ఒక ప్రధానమైన అంశం చుట్టూ తిరిగే కథ ఇది. ఈ కథలో చాలానే పాత్రలు కనిపిస్తాయి. ఆ పాత్రలు.వాటి స్వభావాలు మన చుట్టూ ఉన్న వాస్తవ పరిస్థితులను పరిచయం చేస్తాయి. అయినవాళ్ల పేరుతో ఆస్తులు కాజేయాలనే పాత్రలు.ప్రేమ పేరుతో మోసం చేసే పాత్రలు కనిపిస్తాయి. అయితే మంచి మనుషులకు మంచి ఫలితాలు దక్కుతాయి.స్వార్థంతో ప్రవర్తించేవారికి అందుకు తగిన ప్రతిఫలాలే దక్కుతాయనేది దర్శకుడు చూపించిన విధానం బాగుంది.అయితే ఈ కథలో ఎక్కడా కూడా ట్విస్టులు ఉండవు.కథ చాలా నిదానంగా .. నింపాదిగా నడుస్తూ వెళుతుంది.జీవితానికి గల పరమార్థం ఏమిటంటే,మన చుట్టూ ఉన్నవారికి కొత్త జీవితాన్ని ఇవ్వడమే అనే సందేశం ఈ కథలో మనకి అంతర్లీనంగా కనిపిస్తూ ఉంటుంది.సున్నితమైన భావోద్వేగలకు స్పందించే ఫ్యామిలీ ఆడియన్స్ కి ఈ సినిమా నచ్చే అవకాశాలు ఎక్కువని చెప్పాలి.




## ఓటీటీలోకి లిటిల్ హార్ట్స్ ఎప్పుడంటే?

**టాలీవుడ్, సెప్టెంబర్27:** టాలీవుడ్‌లో సూపర్ హిట్ అందుకున్న చిత్రం లిటిల్ హార్ట్స్ తాజాగా ఓటీటీలోకి రాబోతుంది.మోళి తనూజ్,శివానీ నాగారం హీరోహీ రోయిన్లుగా సాయి మార్తాండ్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా లిటిల్‌హార్ట్స్.ఈటీవీ విన్ ప్రొడక్షన్‌లో రూపొందిన ఈచిత్రాన్ని బన్నీ వాసు,వంశీ నందిపాటి థియేట్రికల్ రిలీజ్ చేశారు.ఇటీవలే విడుదలైన ఈ చిత్రానికి ఆడియన్స్ నుంచి ఊహించని రెస్పాన్స్ వచ్చింది.ముఖ్యంగా యూత్ కి ఈ సినిమా బాగా కనెక్ట్ అయింది.బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లను రాబడుతూ దూసుకెళ్లింది.ఈ సినిమా ఓటీటీ తేదీని మేకర్స్ తాజాగా ప్రకటించారు.రాజీవ్ కనకాల,అనితా చౌదరి,సత్య కృష్ణన్ వంటి నటులు కూడా ఇందులో ముఖ్యపాత్రలు పోషించారు.ఇటీవలే ప్రేక్షకుల ముందు కు వచ్చిన ఈ చిత్రం యూత్ ఎంటర్‌టైనర్‌గా వచ్చి సూపర్‌హిట్‌ను అందుకుంది. తాజాగా ఈ చిత్రం ఓటీటీ వేదిక ఈటీవీ విన్ వేదికగా అక్టోబర్ 01 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.




## దేవర 2 కోసం ఎన్టీఆర్ సిద్ధం




**టాలీవుడ్, సెప్టెంబర్27:** యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్,స్టార్ డైరెక్టం కొరటాల శివలకాంబినేషన్ లో బాక్సాఫీస్ హిట్టైన చిత్రం దేవరకి సీక్వెల్ త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుందని అధికారికంగా ప్రకటించారు.మొదటి భాగం విడుదలై ఏడాది పూర్తయ్యే సందర్భంలో,చిత్ర నిర్మాణ సంస్థ ఎన్టీఆర్ ఆర్ట్స్ సోషల్ మీడియా వేదికగా ఈ అప్‌డేట్‌ను షేర్ చేసింది.సోషల్ మీడియాలో ప్రత్యేక ప్రకటన చిత్ర బృందం ప్రకటించిన ప్రకటనలో,దేవర మొదటి భాగం ప్రతి సీన్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంది.ఇప్పుడు ఎన్టీఆర్‌దేవర2 కోసం సిద్ధమవుతున్నాడు.త్వరలో మరిన్ని అప్‌డేట్స్ అందిస్తాం"అని పేర్కొన్నారు. ఈప్రకటనతో తారక్ అభిమానులు ఉత్సాహంగా స్పందిస్తూ,సోషల్ మీడియాలో సంబరాలు జరుపుకుంటున్నారు.మొదటి భాగం సృష్టించిన ప్రభావాన్ని మించిన సీక్వెల్ వస్తుందని అంచనాలు పెరుగుతున్నాయి.

## యువ సంచలనం అభిషేక్ శర్మ కొత్త రికార్డు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్27:** టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఆసియా కప్‌లో అసాధారణ ప్రదర్శనతో అభిమానులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాడు.దూకుడు బ్యాటింగ్‌కి పేరుగాంచిన ఈ యువకుడు,ప్రస్తుత ఆసియా కప్ 2025 టీ20 టోర్నీలో రికార్డుల వేట మొదలెట్టాడు. వరుసగా తానే సృష్టించిన రికార్డులను అధిగమిస్తూ,ఈ సీజన్‌లో ఒక్క ఎడిషన్‌లోనే అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్‌గా నిలవడం ద్వారా తన ప్రతిభను మరోసారి చాటుకున్నాడు.దుబాయ్ వేదికగా జరుగుతున్న ఆసియా కప్ టీ20 టోర్నీలో అభిషేక్ శర్మ ఓపెనింగ్ నుంచి జట్టుకు మంచి ఆరంభాన్ని అందిస్తున్నాడు.ముఖ్యంగా మిడిల్ ఓవర్లలో కూడా అతని దూకుడు కొనసాగుతూ ఉండటం భారత జట్టు స్కోరును గగనానికి చేర్చేలా మారింది. శుక్రవారం శ్రీలంకతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఈ విధ్వంసకర ఓపెనర్ కేవలం 23 బంతుల్లోనే అర్ధశతకం సాధించడం అందరినీ ఆశ్చర్యపరిచింది.ఈ ఇన్నింగ్స్ అతని కెరీర్‌లో మరో ప్రత్యేక ఘట్టంగా నిలిచింది.ఈ టోర్నీలో ఇప్పటి వరకు 6 ఇన్నింగ్స్‌లు ఆడిన అభిషేక్ శర్మ 309.. పరుగులు చేశాడు. ఆసియా కప్ టీ20 టోర్నీ చరిత్రలో సింగిల్ ఎడిషన్‌లో ఓ బ్యాటర్ చేసిన అత్యధిక పరుగులు ఇవే. అంతేకాకుండా ఈ టీ20 టోర్నీలో 300 పరుగులు చేసిన తొలి ప్లేయర్ కూడా అభిషేక్ శర్మనే.ఈ క్రమంలో అతను పాకిస్థాన్ ఓపెనర్ మహమ్మద్ రిజ్వాన్(281) రికార్డ్‌ను అధిగమించాడు.అత్యధిక పరుగులు చేసిన రెండో భారత బ్యాటర్‌గా అభిషేక్ శర్మ ఈ జాబితాలో అభిషేక్ శర్మ(309),మహమ్మద్ రిజ్వాన్(281),విరాట్ కోహ్లీ(276), ఇబ్రహీమ్ జద్రాన్(5 ఇన్నింగ్స్) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.ఒక టీ20 టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన రెండో భారత బ్యాటర్‌గా అభిషేక్ శర్మ నిలిచాడు.ఈ జాబితాలో విరాట్ కోహ్లీ(319) ముందున్నాడు. టీ20 ప్రపంచకప్ 2014లో కోహ్లీ 6 ఇన్నింగ్స్‌లో 319 పరుగులు చేశాడు.ఈ రికార్డ్‌ను అభిషేక్ శర్మ అధిగమించే అవకాశం ఉంది.అతితక్కువ బంతుల్లో హాఫ్ సెంచరీటీ20 క్రికెట్‌లో అతితక్కువ బంతుల్లో హాఫ్ సెంచరీ బాదిన ఆటగాళ్లలో రోహిత్ శర్మ రికార్డ్‌ను అభిషేక్ శర్మ సమం చేశాడు.ఈ ఇద్దరు చెరో 6 సార్లు తక్కువ బంతుల్లో(25 బంతుల్లోపు) హాఫ్ సెంచరీ నమోదు చేశారు.ఈ జాబితాలో సూర్యకుమార్ యాదవ్(7 సార్లు) టాప్‌లో ఉండగా.రోహిత్,అభిషేక్ శర్మ(6) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు.టీ20ల్లో వరుసగా అత్యధిక 30 ప్లస్ స్కోర్ నమోదు చేసిన బ్యాటర్లలో రోహిత్ శర్మను అభిషేక్ శర్మ సమం చేశాడు.మహమ్మద్ రిజ్వాన్,రోహిత్ శర్మ,అభిషేక్ శర్మ వరుసగా 7 సార్లు 30+ రన్స్ చేశారు.

## బిట్‌కాయిన్ మనీలాండరింగ్ కేసులో శిల్పాశెట్టి పేరు



**బాలీవుడ్, సెప్టెంబర్27:** రాజ్ కుంద్రాకు ఈడీ గట్టి దెబ్బ-బిట్‌కాయిన్ మనీలాండరింగ్ కేసులో ఛార్జిషీట్,శిల్పాశెట్టి పేరు ప్రస్తావన బాలీవుడ్ నటి శిల్పాశెట్టి భర్త,వ్యాపారవేత్త రాజ్ కుంద్రాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)నిదీ పెద్దషాక్ ఇచ్చింది.సంచలనాన్ని రేపినబిట్‌కాయిన్‌మనీలాండరింగ్ వ్యవహారంలో ఈడీ తాజాగా ఛార్జిషీట్ దాఖలు చేసింది.అందులో కుంద్రా పేరు మాత్రమే కాకుండా,ఆయనపై పలు తీవ్రమైన ఆరోపణలు కూడా ఉంచింది.ఈడీ ఆరోపణల ప్రకారం -బిట్‌కాయిన్ మోసం కేసులో ప్రధాన నిందితుడు అమిత్ భరద్వాజ్ నుంచి రాజ్ కుంద్రా 285 బిట్‌కాయిన్లు(విలువ సుమారు రూ.150 కోట్లు) పొందారు.అయితే ఈ లావాదేవీలను కుంద్రా దాచిపెట్టారని,బిట్‌కాయిన్ వాలెట్ వివరాలు కూడా బహిర్గతం చేయలేదని ఛార్జిషీట్‌లో స్పష్టం చేసింది. ప్రస్తుతం ఆ క్రిప్టోకరెన్సీ ఆయన నియంత్రణలోనే ఉందని,వాటి ద్వారాలాభాలు పొందుతున్నారనికూడాపేర్కొంది.శిల్పా-కుంద్రా అదనంగా, తన ఆదాయాన్ని బహిరంగం చేయకుండా ఉండేందుకు రాజ్ కుంద్రా భార్య శిల్పాశెట్టితో ఆర్థిక ఒప్పందం కుదుర్చుకున్నారని ఈడీ నిదీ పత్రాల్లో పేర్కొనడం ప్రత్యేక దృష్టి ఆకర్షిస్తోంది.ఇక ఇదే సమయంలో,శిల్పా-కుంద్రా దంపతులు మరో మోసం కేసులోనూ ఇరుక్కున్నారు.ఒక వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేశారన్న ఆరోపణలతో ఇటీవల ముంబై పోలీసులు రాజ్ కుంద్రాను విచారించారు.ఆ కేసులో భాగంగా వారిద్దరిపై లుకౌట్ నోటీసులు కూడా జారీ చేశారు.తాజా ఛార్జిషీట్‌తో ఈ దంపతులు న్యాయపరంగా మరింత క్లిష్ట పరిస్థితుల్లోకి వెళ్లినట్టయింది.